క్లుప్తంగా

వ్యాసరచన,వక్తృత్వ పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బొండపల్లి: స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శ్రీకాకుళం జిల్లా బెజ్జిపురంనకు చెందిన యూత్ క్లబ్ ఆధ్వర్యంలో 'బాల్యవివాహ రహిత సమాజ స్థాపన', 'బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన' అనే అంశాలపై సోమవారం వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం బహుమతులు ప్రదానం చేయనున్నామని నిర్వాహకులు తెలిపారు. యూత్‌క్లబ్ ప్రతినిధులు వెంకటరమణ, శ్రీను, హెచ్‌ఎం ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి ఆర్థిక సహాయం

చీపురుపల్లి: పట్టణంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన పథకానికి ముగ్గురు దాతలు సోమవారం ఆర్థిక సహాయం చేశారు. లయన్స్ క్లబ్ సభ్యుడు ఎస్.అమరనాథ్ తన వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రూ.5 వేలు, మెరకముడిదాం మండలం భైరీ పురం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు సింగారపు రామకృష్ణ, చీపురుపల్లికి చెందిన వ్యాపారి కిల్లంశెట్టి వెంకటరమణమూర్తి చెరో రూ.5 వేలు చొప్పున అన్నదాన పథకం పర్యవేక్షకులు ఎస్.సన్యాసిరావుకు అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు ఎస్.వి.దుర్గారావు పాల్గొన్నారు.

లోగిశ సర్పంచ్‌గా అనూష ఏకగ్రీవం



కొండ్రోతు అనూష

గజపతినగరం: మండలంలోని లోగిశ పంచాయతీ సర్పంచ్ స్థానానికి నిర్వహించిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు కొండ్రోతు అనూష ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి సీహెచ్.రమేష్‌కుమార్ సోమవారం మాట్లాడుతూ లోగిశ సర్పంచ్ స్థానానికి నలుగురు అభ్యర్థులు నామినేషన్లు వేశారని, వీరిలో ముగ్గురు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారని చెప్పారు. అనూష నామినేషన్ ఒక్కటే మిగలడంతో ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి లాలబాబు తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి ఒరిగిన లారీ



అదుపుతప్పి ఒరిగిపోయిన లారీ

బొండపల్లి: రాయ్‌పూర్ నుంచి కాకినాడ బియ్యం లోడుతో వెళ్తున్న లారీ బొండపల్లి మండలంలోని బిల్లలవలస గ్రామం సమీపంలో జాతీయ రహదారి26పై జంక్షన్ వద్ద అదుపుతప్పి సోమవారం ఉదయం ఒరిగిపోయింది. వేగంగా వస్తున్న లారీ ఒక్కసారిగా అదుపుతప్పి పక్కనే ఉన్న మామిడితోటలోకి వెళ్లిపోయింది. అయితే ఆసమయంలో రహదారిపై పెద్దగా వాహనాల రాకపోకలు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఒరిగిపోయిన లారీలో నుంచి బియ్యం బస్తాలు వేరే లారీలోకి ఎక్కించి లారీని తరలించారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా హైవే మొబైల్ పోలీసులు చర్యలు తీసుకున్నారు.

వారి త్యాగాలు మరువలేనివి



ర్యాలీ చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు

గజపతినగరం: స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయులు, ప్రాణాలు అర్పించిన వీరుల త్యాగాలు మరువలేనివని, వారిని ఎల్లవేలలా స్మరించుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.సోమేష్ అన్నారు. స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా మహాత్మా గాంధీ, భగత్ సింగ్, అల్లూరి సీతారామరాజు, సుభాష్ చంద్రబోస్ తదితరుల చిత్రపటాలతో మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి సోమవారం ర్యాలీ నిర్వహించారు.

రాష్ట్ర పరేడ్‌కు కొత్తవలస విద్యార్థులు



స్టేట్ పరేడ్‌కు ఎంపికైన సోమేశ్వరరావు, యుగందర్, నిహారిక

కొత్తవలస: విజయవాడలో మంగళవారం నిర్వహించనున్న రాష్ట్రస్థాయి స్వాతంత్ర్య దినోత్సవంలో సాగే పరేడ్‌కు కొత్తవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు స్కౌట్ విద్యార్థులు ఎంపికైనట్టు స్కౌట్స్ అండ్ గైడ్ టీచర్ బీపీఏ రాజు సోమవారం తెలిపారు. స్కౌట్స్ యూనిట్ నుంచి ఆర్.సోమేశ్వరరావు, ఎ.యుగందర్, గైడ్స్ యూనిట్ నుంచి సీహెచ్ నిహారిక ఎంపికైనట్టు వెల్లడించారు. జిల్లా నుంచి 8 మంది విద్యార్థులు పరేడ్‌కు ఎంపికకాగా అందులో పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఉన్నారన్నారు. వీరిని పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ ఈశ్వరరావు, గైడ్ కనకమహాలక్ష్మి అభినందించారు.

వీరులు, మహనీయులను స్మరించుకుందాం

స్వాతంత్ర్య సమరయోధులు, దేశం కోసం ప్రాణాలర్పించిన జవానులు, మహనీయులను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పంచాయతీరాజ్ జాయింట్ కమిషనర్ అశోక్‌కుమార్, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు అన్నారు. ఆజాదీకా అమృత్‌మహోత్సవ్‌లో భాగంగా లక్కవరపుకోట, బొండపల్లి, మెరకముడిదాం, దత్తిరాజేరు, వేపాడ, గుర్ల, గజపతినగరం మండలాల్లోని పలు గ్రామాల్లో సోమవారం 'నాభూమి – నాదేశం', 'నేలతల్లికి నమస్కారం – వీరులకు వందనం' కార్యక్రమం నిర్వహించారు. 'నాభూమి– నాదేశం' శిలాఫలకాలను ఆవిష్కరించడంతో పాటు సైనికులు, విశ్రాంత సైనికులను సన్మానించారు. అలాగే రోడ్లకు ఇరువైపులా, చెరువు గట్లపై, ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణాల్లో మొక్కలు నాటారు. మహనీయుల అడుగుజాడల్లో నడుస్తామని, పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామని, దేశసమగ్రతను కాపాడతామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు.

– లక్కవరపుకోట/బొండపల్లి/మెరకముడిదాం/దత్తిరాజేరు/వేపాడ/గుర్ల/ గజపతినగరం



లక్కవరపుకోట: కళ్లేంపూడిలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న పంచాయతీరాజ్ జాయింట్ కమిషనర్ అశోక్‌కుమార్



మెరకముడిదాం: భైరీపురంలో శిలాపలకం వద్ద ప్రమాణం చేస్తున్న నాయకులు, గ్రామపెద్దలు



దత్తిరాజేరు: ఎం.లింగాలవలసలో 'నాభూమి- నాదేశం' శిలాఫలకం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు



దత్తిరాజేరు: పెదమానాపురంలో సైనికులను సన్మానిస్తున్న ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు, పంచాయతీరాజ్ జాయింట్ కమిషనర్ అశోక్‌కుమార్



వేపాడ: నీలకంఠరాజపురంలోరం ప్రతిజ్ఞ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు, ఏఎంసీ చైర్‌పర్సన్ కస్తూరి, గ్రామస్తులు



దత్తిరాజేరు: పెదమానాపురంలో మొక్కలు నాటుతున్న పంచాయతీరాజ్ జాయింట్ కమిషనర్ అశోక్‌కుమార్



బొండపల్లి: అంబటివలసలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు,ఉద్యోగులు



గజపతినగరం: పాతశ్రీరంగరాజపురం స్కూల్ ఆవరణలో మొక్కలు నాటుతున్న సర్పంచ్ కామునాయుడు, తదితరులు



గుర్ల: పాలవలసలో అంబేడ్కర్ చిత్రపటానికి గౌరవ వందనం చేస్తున్న ఎంపీపీ ప్రమీల, అధికారులు

రూ.10 లక్షలతో హాస్టల్ మరమ్మతులు

- జిల్లా పరిషత్ నిధులు మంజూరు
- వసతి గృహంలో సమస్యలకు మోక్షం



హాస్టల్ ప్రాంగణంలో బోరు తవ్వకాలు

చీపురుపల్లి: స్థానిక బీసీ సంక్షేమ సమీకృత బాలుర వసతిగృహ విద్యార్థుల ఇబ్బందులకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. హాస్టల్‌లో మరుగుదొడ్లు పాడవ్వడంతో పాటు, రన్నింగ్ వాటర్ సమస్య ఉంది. విద్యార్థులు మలమూత్ర విసర్జనకు బయటకు వెళ్లాల్సి వస్తోంది. సమస్య తెలుసుకున్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాస్టల్‌లో అత్యవసరంగా చేపట్టాల్సిన మరమ్మతులు, ఇతర పనుల కోసం జిల్లా పరిషత్ నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేశా రు. ఈ నిధులతో ఇంజినీరింగ్ అధికారులు సోమవారం పనులు ప్రారంభించారు. చీపురుపల్లి, గరివిడి పట్టణాల్లో ఉన్న బీసీ, ఎస్సీ బాలుర హాస్టళ్లను విలీనం చేస్తూ బీసీ సంక్షేమ బాలుర సమీకృత వసతిగృహం పేరుతో చీపురుపల్లిలో 2007లో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. 2010లో వసతిగృహాన్ని ప్రారంభించి అక్కడే విద్యార్థులకు అందు బాటులో ఉండే విధంగా పాఠశాలను కూడా ఏర్పాటు చేశారు. హాస్టల్‌లో 2014లోనే రన్నింగ్ వాటర్, మరుగుదొడ్లు, ఇతర సమస్యలు తలెత్తాయి. అయినప్పటికీ నాటి ప్రభుత్వం మరమ్మతులు చేపట్టలేదు. ఎట్టకేలకు జిల్లా పరిషత్ చైర్మన్ చొరవతో సమస్యలు పరిష్కారం కానున్నాయి. హాస్టల్‌లో పూర్తిగా పాడై వినియోగానికి దూరంగా ఉన్న మరుగుదొడ్లను బాగు చేయిస్తున్నారు. ఇక్కడ మూడు బోర్లు ఉన్నప్పటికీ పైఅంతస్తులో ఉన్న వాటర్ ట్యాంక్‌కు నీరు ఎక్కడం లేదు. దీంతో మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ సమస్య తలెత్తింది. తాజాగా మరో బోరు తవ్వించారు. ప్రస్తుతం ఉన్న బోర్ల నుంచి ట్యాంక్‌కు నీరు ఎక్కించేందుకు అవకాశం లేకపోతే కిందనే సంప్ నిర్మించి దాని నుంచి వాటర్ పంపించే ఏర్పాటు చేస్తామని మండల ఇంజినీరింగ్ అధికారి డి.రమేష్ తెలిపారు. హాస్టల్‌లో సమస్యలన్నీ పరిష్కరించాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు ఆదేశాలు జారీ చేశారని ఇంజినీరింగ్ అధికారి స్పష్టం చేశారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసులనాయుడు

గజపతినగరం: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన పీఆర్టీయూ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీపీఎస్ నాయకులతో చర్చించి సీపీఎస్ రద్దు చేసేలా నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరామని చెప్పారు. వివిధ యాప్‌ల నిర్వహణ వల్ల తలెత్తుతున్న సమస్యలను పీఆర్టీయూ ఎమ్మెల్సీల బృందం ప్రభుత్వ పెద్దలతో చర్చించిందని, యాప్‌లు అన్ని తీసివేసి ఒక్క ఫేషియల్ యాప్ మాత్రమే ఉంటుందని పెద్దలు హామీ ఇచ్చారని తెలిపారు.అనంతరం పీఆర్టీయూ పూర్వ ప్రధాన కార్యదర్శి బి.అప్పారావును సన్మానించారు. పీఆర్టీయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రావాడ రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి బి.జి.బి.ఎస్.శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి బి.లాలబాబు, దత్తిరాజేరు,బొండపల్లి,మెంటాడ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.





13 వార్డు స్థానాలు ఏకగ్రీవం

బొండపల్లి: మండలంలోని నాలుగు వార్డు స్థానాలకు సంబంధించిన ఉపఎన్నికలో మూడు వార్డులు ఏకగ్రీవమయ్యాయని ఎంపీడీఓ వై.వి.రాజేంద్రప్రసాద్ సోమవారం తెలిపారు. మరువాడ- 2వ వార్డుకు దాసరి కాంత, ఒంపల్లి-2వ వార్డుకు దొంత అప్పలనారాయణ ఒక్కొకరే నామినేషన్ వేయడంతో వారి ఎన్నిక ఏకగ్రీవమైంది. కొండకిండాం-5వ వార్డుకు సంగంరెడ్డి సీతారత్నం, కలిశెట్టి బంగారునాయుడు నామినేషన్ వేయగా, సీతారత్నం నామినేషన్ ఉపసహరించుకోవడంతో బంగారునాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దేవుపల్లి-13 వార్డుకు అయిదుగురు నామినేషన్లు వేయగా ముగ్గురు విత్‌డ్రా చేసుకున్నారు. పోటీలో మలిరెడ్డి శ్యామలరావు, గాధం రాజేంద్రకుమార్ నిలిచారు. వీరికి 19వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

గుర్ల మండలంలో...

గుర్ల: మండలంలోని వల్లాపురం, గొలగాం, దేవునికణపాక గ్రామాల్లో వార్డు మెంబర్ల ఉపఎన్నిక ఏకగ్రీవం అయ్యిందని ఎంపీడీఓ బి.కల్యాణి సోమవారం తెలిపారు. వల్లాపురం-8వ వార్డు మెంబర్‌గా నందా సుశీల, గొలగాం- 8వ వార్డు మెంబర్‌గా కర్నాన రమేష్, దేవునికణపాక-8వ వార్డు మెంబర్‌గా కొర్నాన తాతప్పుడు ఎన్నికయ్యారు.

వేపాడ మండలంలో..

వేపాడ: మండలంలో అయిదు వార్డుమెంబర్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయని ఎంపీడీఓ బి.ఎస్.ఎస్.కూర్మనాథ్ పట్నాయక్ సోమవారం తెలిపారు. కె.ఆర్.పేటలో నెక్కల అచ్చమ్మ,శింగరాయిలో గేదెల ముత్యాలమ్మ, వల్లంపూడిలో రెండు వార్డులకు శానాపతి జోగినాయుడు, ఇసరాపు శారద, బొద్దాంలో అరిగి రమణమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జగ్గయ్యపేటలో ఒకవార్డు మెంబర్ స్థానానికి ఇద్దరు నామినేషన్లు వేయగా ఇద్దరూ తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారని ఎంపీడీఓ తెలిపారు.

గజపతినగరం మండలంలో..

గజపతినగరం: మండలంలోని సాలిపేట-1వ వార్డు మెంబర్ స్థానానికి గంట్యాడ గురునాయుడు, జిన్నాం- 5వ వార్డు మెంబర్ స్థానానికి కిలారి చిన్నయ్య ఒక్కొక్కరే నామినేషన్ వేశారు. వీరి ఎన్నిక ఏకగ్రీవమైందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సీహెచ్.రమేష్‌కుమార్ సోమవారం తెలిపారు.

విద్యతోనే దేశ భవిష్యత్తు



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ వెంకటరావు

బొండపల్లి: విద్యతోనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని, ఉన్నత లక్ష్యాలు గల విద్యార్థులతోనే రాష్ట్రం, దేశం అభివృద్ధి సాధ్యమని విజయనగరం వన్ టౌన్ సీఐ బి.వెంకటరావు అన్నారు. మండలంలోని గొట్లాం గ్రామంలో గాయత్రీ విద్యా సంస్థలో విశ్వగురు వరల్డ్ రికార్డ్స్, లిఫ్టింగ్ హ్యాండ్స్ సేవా సంఘం ఆధ్వర్యంలో 'మేరా భారత్‌మహాన్' కార్యక్రమం సోమవారం నిర్వహించారు. జాతీయ జెండాలోని అశోక ధర్మచక్రంలోని 24 చువ్వల ప్రత్యేకతను విద్యార్థులకు సీఐ వివరించారు. ప్రతీ విద్యార్థి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిసాధనకు కృషి చేయాలని సూచించారు. దేశభక్తి కలిగి ఉండాలని అన్నారు. అనంతరం విద్యా ర్థులతో ప్రతిజ్ఞ చేయించా రు. విజయనగరం రూరల్ సీఐ టి.వి.తిరుపతిరావు, బొండపల్లి ఎస్ఐ ఎస్.రవి, గాయత్రీ విద్యాసంస్థల కరస్పాండెంట్ జి.ఎరుకునాయుడు, ఏఓ రాఘవ, లిఫ్టింగ్ హ్యాండ్‌సేవా సంస్థ ఉపాధ్యక్షుడు ఎస్.అచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.సూర్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

గ్రీన్ అంబాసిడర్ల వినతి

దత్తిరాజేరు: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న తమ సమస్యలు పరిష్కరించాలని మండలంలోని గ్రీన్ అంబాసి డర్లు ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పల నాయుడుకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం కార్యదర్శి శ్రీనివాసనాయుడు తో కలిసి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీని సోమవారం కలిసి సమస్య లు వివరించారు. సకాలంలో జీతాలు చెల్లించాలని, పీఎఫ్,ఈఎస్ఐ,బీమా తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు.

కెంగువలో 'ఫ్యామిలీ డాక్టర్'

గజపతినగరం: మండలంలోని కెంగువ గ్రామంలో మరుపల్లి పీహెచ్‌సి వైద్యాధికారి సుష్మ ఆధ్వర్యంలో సోమవారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించా రు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిబిరంలో 93 మందికి వైద్య సిబ్బంది వివిధ వైద్య పరీక్ష లు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం గృహసందర్శన చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ అనిత, ఆరోగ్య కార్యకర్త కళావతి, ఆశ కార్యకర్త సింహాచలం,హెల్త్ అసిస్టెంట్ శంకరరావు పాల్గొన్నారు.

కల్వర్టు పరిశీలన

వేపాడ: వేపాడ- ఆనందపురం రహదారి విస్తరణలో భాగంగా బక్కునాయుడు చెరువు వద్ద ఆర్అండ్‌బీ అధికారులు నిర్మించిన పైపు కల్వర్టును తహసీల్దార్ ప్రసన్నకుమార్ సోమవారం పరిశీలించారు. పైపు కల్వర్టు నిర్మాణం వల్ల భూములకు సాగు నీరు సక్రమంగా అందడం లేదని పలువురు రైతులు స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈమేరకు తహసీల్దార్ కల్వర్టును పరిశీలించారు. , సమస్యను ఆర్అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ రైతులకు హామీ ఇచ్చారు. ఆర్ఐ రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

వేపాడ: మండలంలోని అరిగి గ్రామ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ-2 బాలభాస్కరరావు సోమవారం సందర్శించారు. విద్యార్థుల హాజరు, వర్క్ బుక్స్, సమ్మెటివ్ -1 పరీక్షా పత్రాలు, పలు రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వంట నిర్వాహకులు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాలు అందించేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు.